చెట్లకిందే మధ్యాహ్న భోజనం

- ఇబ్బందులు పడుతున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు
- డైనింగ్‌హాల్ నిర్మించాలని వేడుకోలు


ఆదర్శ పాఠశాలలో చెట్ల కిందనే కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులు

నిడమనూరు : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని చెబుతున్న ప్రభుత్వాలు ఆచరణలో మాత్రం కనిపించడంలేదు. దీంతో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు పాఠశాలల్లో సరైన వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు డైనింగ్ హాల్ లేకపోవడంతో వారు పాఠశాల ఆవరణలోని చెట్లకింద కూర్చొని మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 684 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కొందరు విద్యార్థినులు మాత్రమే తరగతి గదిలో, హాస్టల్‌లో భోజనం చేస్తుండగా, చాలా మంది విద్యార్థులు పాఠశాల ప్రాంగణంలోని చెట్లకిందనే భోజనం చేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం పాఠశాల ప్రాంగణంలో వంటగది సమీపంలోనే డైనింగ్ హాలు (రేకుల షెడ్డు వేస్తే) నిర్మిస్తే బాగుంటుందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. పీఎం శ్రీ నిధులు కానీ, మరో పథకంలోనైనా డైనింగ్ షెడ్డు నిర్మించాలని ప్రిన్సిపల్ నిర్మల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.

పీఎం శ్రీ పథకానికి ఎంపిక..

మన ఊరు– మన బడి పథకంలో ఎర్రబెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల తరహాలోనే మధ్యాహ్న భోజన షెడ్డు నిర్మించారు. అదే తరహాలో నిడమనూరు ఆదర్శ పాఠశాలలో నిర్మిస్తే బాగుంటుందని పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొంటున్నారు. భోజనం తరగతి గదిలోనే చేస్తే విద్యాభ్యాసానికి ఇబ్బందిగా ఉంటుందని చెట్లకిందనే భోజనం చేస్తున్నారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. నిడమనూరు ఆదర్శ పాఠశాల పీఎం శ్రీ పథకానికి ఎంపికైంది. దీంతో గత ఏడాది రూ.6లక్షలతో విద్యార్థులను హైదరాబాద్ శివారులోని పలు దర్శనీయ ప్రదేశాలకు తీసుకెళ్లారు. పీఎంశ్రీ నిధులతో పాఠశాలలో సైన్స్‌కు సంబంధించి కానీ, చారిత్రక ప్రదేశాలకు తీసుకెళ్లకపోవడంపై పలువురు విద్యానిపుణులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పీఎం శ్రీ నిధులతో మధ్యాహ్న భోజన షెడ్డు నిర్మిస్తే బాగుండేదని స్థానికులు వాపోతున్నారు. పీఎం శ్రీ నిధులు సద్వినియోగం చేసుకొని సైన్స్ ల్యాబ్‌లు, సదస్సులు, సైన్స్ ఎగ్జిబిషన్ ఉపయోగపడే పరికరాలు కొనుగోలు చేయాలని విద్యావంతులు సూచిస్తున్నారు.

అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాంకూడా

ఇటీవల నిడమనూరు ఆదర్శ పాఠశాలలో జరిగిన ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బీఎల్ఓల సదస్సుకు వచ్చిన అదనపు కలెక్టర్‌కు పాఠశాలలో డైనింగ్‌హాల్ గురించి విన్నవించాం. ఈ నేపథ్యంలో విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో పడుతున్న ఇబ్బందులు పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టేలా చూస్తానని అన్నారు. డైనింగ్ హాల్ ఏర్పాటు కోసం మరోసారి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– నిర్మల, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్

క్లుప్తంగా

నేడు రేషన్‌కార్డుల పంపిణీ

కొండమల్లేపల్లి : మండలంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన రేషన్‌కార్డులను స్థానిక బైపాస్‌రోడ్డులో గల సాయికృప ఫంక్షన్ హాలులో గురువారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నరేందర్ బుధవారం తెలిపారు. అంతకుముందు పట్టణ కేంద్రంలో పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి ప్రారంభించనున్నారు. కావున లబ్ధిదారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 7వవార్డు బాపూజీనగర్ (నాగులపుట్ట)లో దాతల సహకారంతో రూ.50లక్షలతో నిర్మించిన శ్రీశ్రీశ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు నేటి (గురువారం) నుంచి ప్రారంభంకానున్నాయి. అయితే స్వామివారి దేవాలయం నిర్మాణానికి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి, నాగేంద్రస్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు.

వన్యప్రాణులను సంరక్షించాలి


పాఠశాలలో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

పెద్దఅడిశర్లపల్లి : అడవుల్లోని వన్యప్రాణులను సంరక్షించాలని వద్దిపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం నక్క శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని వద్దిపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో అటవి శాఖ అధ్వర్యంలో ఇంటర్ నేషనల్ టైగర్స్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి మొక్కలు నాటారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అటవి శాఖ సెక్టోరియల్ అధికారి రాములు, బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ బాబు, ఉపాధ్యాయులు మనెమ్మ, సురేందర్, వెంకన్న, జ్యోతి, సబిత, శివయ్య, వెన్నెల, ఫయాజ్ విద్యార్థులు తదితరులున్నారు.

'కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నారు'

పెద్దవూర : కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జటావత్ రవినాయక్ అన్నారు. బుధవారం మండలంలోని ఉట్లపల్లిలో నిర్వహించిన గ్రామ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూరిగుడిసెలు ఉన్నవారికి కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం ఏంటని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు చెన్ను సుందర్‌రెడ్డి, మెండె సైదులు, రామవత్ రవినాయక్, పాదిళ్ల శ్రీను, శశిధర్‌రెడ్డి, ఇంజ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, గౌస్, అంజయ్య, రాజు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ


రోగులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యులు

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం క్షయ వ్యాధి రోగులకు పోషకాహార కిట్లు, మందులను ఆరోగ్య కేంద్రం డాక్టర్లు సయ్యద్ హజహర్ అమ్మద్, రామాంజనేయులు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది షాహెద్‌లతో పాటు వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

పెద్దవూర : పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తూర్పు పూలగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలో ప్రహరీ, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అమ్మ ఆదర్శ పాఠశాల, ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ.1.70లక్షలతో ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డితో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంఈఓ తరి రాములు, మాజీ ఎంపీటీసీ గోదాల నారాయణరెడ్డి, పాఠశాల హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు రేణుక, గ్రామస్తులు లింగయ్య, ఈదయ్య పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆపరేషన్ ముస్కాన్ టీం, రైల్వే పోలీసులతో కలిసి రైల్వే ప్రయాణికులకు ఈ అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. 18సంవత్సరాల లోపు బాలబాలికలు ఈ అక్రమ రవాణాకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ ముస్కాన్ ఎస్ఐ శ్రీనివాస్, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ చైల్డ్ టీం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి


హైమాస్ట్ లైట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి

గుర్రంపోడు : బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని, గ్రామాల్లో ఇప్పుడు కనిపిస్తున్న అభివృద్ధి అంతా బీఆర్‌ఎస్ హయాంలో జరిగిందేనని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పోంచంపల్లి, వద్దిరెడ్డిగూడెం గ్రామాల్లో సీడీపీ నిధులు రూ.12లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే గ్రామాలకు మౌలిక వసతులు కల్పించామని, ప్రతి గ్రామపంచాయతీకి ఒక ట్రాక్టర్, జనాభా ప్రాతిపదికన మల్టీపర్పస్ వర్కర్లను నియమించామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ట్రాక్టర్‌కు మెయింటెన్స్ నిధులు కూడ ఇవ్వలేకపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పాశం గోపాల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు, నాయకులు కూనూరు సైదిరెడ్డి, కోటేష్, వేముల యాదయ్య, తేలుకుంట్ల కుర్మారెడ్డి, మోపూరి మురళీచారి, దోటి గణేష్, ఐతగోని కృష్ణ గౌడ్, పురుషోత్తం, శ్రీను, అమీర్, అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్ర వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్సీ పరామర్శ

హాలియా : పట్టణానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, నల్లగొండ జిల్లా మాజీ కౌన్సిలర్ల సంఘం అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి ఇటీవల కింద పడి విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి బుధవారం పట్టణంలోని వెంకట్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అల్లి పెద్దిరాజు యాదవ్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వడ్డె సతీష్‌రెడ్డి, దోరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు బందిలి పెద్ద సైదులు, యూత్ అధ్యక్షుడు పగడోజు సైదాచారి, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు మద్దిమడుగు మార్క్, రావులపాటి ఎల్లయ్య, మారేపాక మల్లికార్జున్‌గౌడ్, నాగరాజుగౌడ్, సతీష్‌గౌడ్, సుబ్రహ్మణ్యం, నాగరాజు తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలి

- జెడ్పీ సీఈఓ శ్రీనివాస్‌రావు


మండల పరిషత్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు

నిడమనూరు : స్థానిక ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలని జెడ్పీ సీఈఓ బి.శ్రీనివాస్‌రావు సూచించారు. నిడమనూరు మండల పరిషత్ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ పథకాల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. మండలానికి 774 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా, 58 శాతం నిర్మాణ పనులు ప్రారంభించినట్లు అధికారులు వివరించారు. పంచాయతీ కార్యదర్శులతో ఇంటి నిర్మాణ పనులపై సమీక్షిస్తున్నట్లు అధికారులు వివరించారు. వల్లాభపురం గ్రామానికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు జాబితా ఇంకా పెండింగ్‌లోనే ఉందన్నారు. అనంతరం బంకాపురం గ్రామంలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంజి వెంకటేషం, సూపరింటెండెంట్ బోనగిరి రమేష్, రాధాకృష్ణ, శశాంక, అధికారులు పాల్గొన్నారు.

మాలల హక్కుల సాధనకు ఉద్యమించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : మాలలు కోల్పోయిన రాజ్యాంగ బద్ధమైన హక్కులను తిరిగి పొందాలంటే ఉద్యమాలు చేపట్టాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య అన్నారు. బుధవారం మండలంలోని అల్వాల ఎక్స్ రోడ్డు వద్ద నిర్వహించిన తిరుమలగిరి సాగర్ మండల మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ వాదులైన మాలలను అణచివేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఏకతాటిపైకి వచ్చి అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన వర్గీకరణ, రోస్టర్ పాయింట్ల కెటాయింపుతో మాలలకు విద్యా, ఉద్యోగ అవకాశాలు అందకుండా పోయాయని వాపోయారు. అనంతరం మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో మాలలకు ఐదు శాతానికి పరిమితం చేసి రోస్టర్ పాయింట్ల కెటాయింపులో ఆ ఐదు శాతం రిజర్వేషన్‌లు మాలలకు దక్కకుండా చేసి రాజ్యాంగ బద్దమైన హక్కులను కాలరాశారని విమర్శించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు లకుమాల మధుబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పరిమి కోటేశ్వర్‌రావు, డీఈ చెన్నకేశవులు, రాష్ట్ర కార్యదర్శి జంగాల భిక్షం, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మమ్మ, నియోజకవర్గ అధ్యక్షుడు లకుమాల లింగయ్య, జంగాల శ్రీనివాస్, రువ్వ వెంకటేశ్వర్లు, శాలెం రాజు, జంగాల వీరేందర్, సుమలత, మైనిక, మద్దూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వన్‌టౌన్ సీఐ మోతీరామ్

మిర్యాలగూడ అర్బన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువ చైతన్య సైకిల్ యాత్రను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడావత్ రవినాయక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం సైకిల్ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను వన్‌టౌన్, టూటౌన్ సీఐలు మోతీరామ్, సోమనర్సయ్య చేతుల మీదుగా ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. నేటి సమాజంలో యువత చెడు మార్గంలో ప్రయాణిస్తున్నారని, ప్రధానంగా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు ప్రదార్థాలకు బానిలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఆశీర్వాదం, వదూద్, నాగేంద్ర ప్రసాద్, బాబునాయక్, పల్లా భిక్షం, నాగరాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో స్పాట్ కౌన్సెలింగ్

పెద్దవూర : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్‌లో సీఈసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం స్పాట్ కౌన్సెలింగ్ జరుపుతున్నట్లు స్పెషల్ ఆఫీసర్ జ్యోత్స్న బుధవారం తెలిపారు. అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని నేరుగా కేజీబీవీ కళాశాలకు వచ్చి హాజరు కావాలని సూచించారు.

చందంపేట : నేరెడుగొమ్ము కేజీబీవీ కళాశాలలో ఇంటర్ ఎంపీసీలో మిగిలిన సీట్లకు అర్హత కలిగిన విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఎస్ఓ శ్వేత బుధవారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

భవిత కేంద్రం పరిశీలన


భవిత కేంద్రంలో విద్యార్థులతో తహసీల్దార్

నిడమనూరు : మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని తహసీల్దార్ జంగాల కృష్ణయ్య బుధవారం పరిశీలించారు. భవనం మరమ్మతులను ఇటీవల రూ.3.1లక్షలతో చేపట్టారు. కేంద్రంలో రంగులు వేసి, విద్యార్థుల అభ్యసన, ఫిజియోథెరఫీ సామగ్రి కొనుగోలు చేశారు. మండలంలో 120మంది వరకు ప్రత్యేక దివ్యాంగ విద్యార్థులు ఉండగా, కేంద్రానికి వచ్చే 16మంది విద్యార్థులకు బొమ్మలు, ఫిజియోథెరపీ అందజేస్తున్నట్లు ఎంఈఓ వెంకన్న తెలిపారు. ఆయన వెంట భవిత కేంద్రం ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ చిరుమర్రి హేమలత అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. బుధవారం దామరచర్ల ప్రాజెక్ట్ పరిధి ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ తక్షణ సాయం కింద మృతురాలు హేమలత కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి, అంగన్‌వాడీ టీచర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిరావాలి


పింఛన్‌దారులతో మాట్లాడుతున్న నాయకులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలో ఆగస్టు 1న జరిగే చేయూత పెన్షన్‌దారుల జిల్లా మహాసభకు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఉట్లపల్లి, తక్కెళ్లపాడు, తడకమళ్ల గ్రామాల్లో చేయూత పెన్షన్‌దారుల సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో భాగంగా అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే దివ్యాంగులకు 6వేలు, పెన్షన్‌దారులకు 4వేలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చి 20నెలలు అవుతున్నా నేటికీ ఇచ్చిన మాటను నిలుపుకోలేదన్నారు. సభకు మంద కృష్ణమాదిగ హాజరువుతున్నందున పింఛన్‌దారులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్ జానకిరామయ్య చౌదరి, బకరం శ్రీనివాస్, మండల, నాయకులు తదితరులున్నారు.

యూరియా కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


ప్రజావాణిలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అధికారులు

మిర్యాలగూడ : రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో ఆయన సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్, డీఎస్పీ రాజశేఖర్‌రాజుతో కలిసి పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. వానాకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా అధికారులు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే గత ప్రభుత్వాల కంటే ముందుగానే సాగునీటిని విడుదల చేశామని, ఎరువుల కొరత లేకుండా, బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా, దుకాణాదారులు రైతులను ఇబ్బందులకు గురి చేయకుండా నిరంతరం సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షించాలన్నారు. సమస్య ఏదైనా ఉంటే ప్రజావాణిలో దరఖాస్తు చేసుకుంటే 15రోజుల్లో సమస్య పరిష్కారానికి నిరంతరం సంబంధిత శాఖ అధికారులు కృషి చేస్తారని అన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుచుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్

త్రిపురారం : రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో మండలంలోని అన్ని స్థానాలు బీఆర్‌ఎస్ గెలుచుకునే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పోయిందని, బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తలకు సరైన సమయంలో గుర్తింపు వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో అలకలు వీడి కలిసికట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం మండలంలోని అల్వాలపాడు గ్రామంలో బీఆర్‌ఎస్ కార్యకర్త బోలిగోర్ల నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో తన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సమావేశంలో పామోజు వెంకటాచారి, అనుముల శ్యాంసుందర్‌రెడ్డి, గుండెబోయిన వెంకటేశ్వర్లు, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, మజ్జిగపు వెంకట్‌రెడ్డి, చెన్ను శ్యాంసుందర్‌రెడ్డి, జంగిలి శ్రీనివాస్, భైరం కృష్ణ, నగిరి శ్రీనివాస్, చింతకాయల యాదయ్య, దైద రవి, లింగయ్య, సైదులు, శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవికుమార్

నాగార్జునసాగర్ : నందికొండలోని మహాత్మాజ్యోతిబాఫూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల బీసీ గురుకులం విద్యార్థులు అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా స్థాయిలో విజయం సాధించి 9బంగారు, ఒక వెండి, ఒక కాంస్య పతకం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఆగస్టు 3,4తేదీల్లో హన్మకొండలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాలలో ప్రిన్సిపాల్, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు. 1000మీటర్ల పరుగు పందెంలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం విద్యార్థి నందకిషోర్ బంగారు పతకం సాధించాడు. 200మీటర్ల పరుగులో, లాంగ్ జంప్‌లో సీఈసీ సెకండ్ ఇయర్ విద్యార్థి ఎ.రవితేజ బంగారు పతకం, షార్ట్‌పుట్‌లో ఎంఈసీ మొదటి సంవత్సరం విద్యార్థి చందు బంగారు పతకం, ట్రైథ్లాన్–ఏలో పదోతరగతి విద్యార్థి ఎం.గణేష్ బంగారు పతకం, 600మీటర్ల పరుగులో 8వ తరగతి విద్యార్థి ఎం.చరణ్ బంగారు పతకం, ట్రైథ్లాన్–సిలో 8వతరగతి విద్యార్థి బి.శివ వెండి పతకం, బి.సాయిచరణ్ తేజ కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభావంతులైన విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

రాంరెడ్డి ఆశయ సాధనకు కృషిచేయాలి


రాంరెడ్డి స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి తదితరులు

మిర్యాలగూడ : సీపీఎం సీనియర్ నాయకుడు గట్టికొప్పుల రాంరెడ్డి ఆశయ సాధనకు కార్యకర్తలు కృషిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తడకమళ్ల గ్రామంలో రాంరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. నిత్యం పేద ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేశారని కొనియాడారు. మిర్యాలగూడ డివిజన్‌లో పార్టీ నిర్మాణం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మల్లు గౌతంరెడ్డి, ముడావత్ రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, పరుశురాములు, గాదె పద్మ, చినగాని సైదమ్మ, వెంకటయ్య, పుండరాచారి, చౌగాని వెంకన్న, పిలుట్ల సైదులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామంలో ముదిరాజ్ కులస్తులు ఆరాధ్యదైవనం పెద్దమ్మతల్లి నూతన ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ కులస్తులు బుధవారం భూమి పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులతో పాటు గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు పాల్గొని వేదపండితుల సమక్షంలో వేదమంత్రోచ్చరణల నడుమ పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, పామోజు వెంకటాచారి, అర్రూరి సైదులు, చెట్లపల్లి శంకరయ్య, వెంకటేశ్వర్లు, రేపాల శ్రీను, హనుమయ్య, చాగంటి సత్యం, సైదులు, రాంబాబు, నాగయ్య, గడ్డం కోటయ్య, కోట సైదులు, నారాయణ రెడ్డి, ముదిరాజ్ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మించారు.. మరిచారు!

- నిరుపయోగంగా గ్రంథాలయ భవనం
- 2022లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8లక్షల30వేలతో నిర్మాణం
- పుస్తకాలు లేక నేటికీ తెరుచుకోని వైనం


నిరుపయోగంగా ఉన్న గ్రంథాలయ భవనం

కొండమల్లేపల్లి : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. ఈ గ్రంథాలయాలు విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులకు కావాల్సిన సమాచారాన్ని అందించే విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడుతాయి. కాని మండల పరిధిలోని గుమ్మడవల్లిలో నిర్మించిన గ్రంథాలయ భవనం ప్రారంభం నాటి నుంచి నేటి వరకు తెరుచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంటుంది. ఈ గ్రంథాలయ భవనానికి 2022లో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.8లక్షల 30వేలు కేటాయించి పూర్తి చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు భవనం తెర్చుకోలేదు. భవనం నిర్మించారు కానీ అందులో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇది కేవలం పేరుకే గ్రంథాలయంగా మారింది. ఈ గ్రామపెద్దలు కూడా పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తుంది. అదే విధంగా చింతకుంట్ల గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కంప్యూటర్ ల్యాబ్‌గా ఉపయోగించుకుంటున్నారు.

దాతల కోసం ఎదురుచూపు..

గుమ్మడవల్లి గ్రామంలోని గ్రంథాలయంలో పుస్తకాలు లేకపోవడంతో గ్రంథాలయ నిర్వహణ కొనసాగడం లేదని అధికారులు అంటున్నారు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి సహకారం అందించి పుస్తకాల కొనుగోలుకు సహకరిస్తే గ్రంథాలయ నిర్వహణ కొనసాగించొచ్చని అధికారుతో పాటు విద్యార్థులు, యువత అంటున్నారు. ఇప్పటికైనా ఎవరైనా దాతలు ముందుకొచ్చి గ్రంథాలయ నిర్వహణకు తోడ్పాటును అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాతలు సహకరించాలి

గుమ్మడవల్లిలో ఉన్న గ్రంథాలయ భవనం నిరుపయోగంగా ఉన్న మాట వాస్తవమే. అక్కడ పుస్తకాలు లేక గ్రంథాలయ నిర్వహణ కొనసాగడం లేదు. ఎవరైనా దాతలు ముందుకొచ్చి గ్రంథాలయానికి కావల్సిన సామగ్రిని, పుస్తకాల కొనుగోలుకు సహాయం చేస్తే నిర్వహణ కొనసాగిస్తాం.

– బాలరాజురెడ్డి, ఎంపీడీఓ, కొండమల్లేపల్లి